


బాధ్యతలు స్వీకరించిన ఎస్ఐ జబీర్

ప్రజాశక్తి - కిర్లంపూడి



కిర్లంపూడి ఎస్ఐగా ఎస్‌కె.జబీర్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయనకు స్టేషన్ సిబ్బంది ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎస్ఐ జబీర్ మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని అన్నారు. స్టేషన్ పరిధిలో ఎటువంటి అసాంఘిక కార్యక్రమాలు నిర్వహించిన చట్ట ప్రకారం చర్యలు తసుకుంటానని హెచ్చరించారు. రాబోయే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఎటువంటి ఇబ్బందులు లేకుండా, మండలంలో శాంతియుతంగా ఎన్నికలు నిర్వహించేందుకు ప్రజలు సహకరించాలని కోరారు.

నేడు జెఎన్‌టియుకె స్నాతకోత్సవం

- ఏర్పాట్లను పూర్తి చేసిన వర్సిటీ అధికారులు
- హాజరు కానున్న గవర్నర్ అబ్దుల్ నజీర్



ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

సాంకేతిక విద్యారంగంలో ఎప్పటికప్పుడు నూతన ఒరవడులను అందిపుచ్చుకుంటూ, కొంగొత్త ఆలోచనలకు పదును పెడుతూ, విద్యార్థులను వినూత్న ప్రయోగాల వైపు మళ్లిస్తూ... విప్లవాత్మక మార్పులతో ముందుకు దూసుకుపోతున్న కాకినాడలోని జవహర్ లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం ఈ నెల 31న 10వ స్నాతకోత్సవ పండుగకు సిద్ధమైంది. వర్సిటీ ఆవరణలో గల అలూమిని ఆడిటోరియం వేదికగా జరుగనున్న ఈ ఉత్సవానికి రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ ముఖ్య అతిథిగా హాజరవుతున్నారు. ఇప్పటికే ఇందుకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేసినట్లు వర్సిటీ అధికారులు తెలిపారు. ఈ సంబరానికి 8 జిల్లాల నుంచి పలువురు ప్రముఖులు, ప్రొఫెసర్లు, శాస్త్రవేత్తలు, అధ్యాపకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరుకానున్నారు.

జెఎన్‌టియుకెలో ఎంతో మంది సాంకేతిక ఓనమాలు దిద్దుకున్నారు. టెక్నాలజీ సాయంతో వేలమంది నిపుణులుగా ఎదిగారు. కష్టపడి చదివిన ప్రతిఒక్కరికీ అపురూప విజయాలను అందించిన నైపుణ్యం గల వర్సిటీగా జెఎన్‌టియుకె పేరుగాంచింది. 1946లో ఏర్పడిన జెఎన్‌టియు కళాశాలలో ఎందరో ప్రముఖులు విద్యనభ్యసించారు. ఢిల్లీ మెట్రో రైలు ఎమ్‌డి ఇ.శ్రీధరన్ నుంచి ఎపిపిఎస్‌సి చైర్మన్ ఉదయభాస్కర్, శివసాగర్‌రావు, భాస్కరుడు, జి.ప్రసాదరావు, వరప్రసాదరెడ్డి, ఐఎఎస్ రవిచంద్ర, శ్యామలరావు, శ్రీకాంత్, సిఎస్ ప్రసాదరావు, ప్రస్తుత మంత్రి ఆదిమూలపు సురేష్ వరకు ఎంతో మంది ప్రముఖులు ఈ కళాశాలలో ఇంజినీరింగ్ విద్యనభ్యసించినవారే. సామాన్యులను సైతం అసమాన్య ఇంజినీర్లగా తీర్చిదిద్దడంతోపాటుగా అనేక మందికి అవకాశాలిచ్చి అద్భుత విజయాలను సాధించేలా తోర్పాటుని అందించింది. ఈ నేపథ్యంలో జెఎన్‌టియుకె స్నాతకోత్సవాన్ని అంగరంగ వైభవంగా తీర్చిదిద్దేందుకు వర్సిటీ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. టిసిఎస్ ప్రెసిడెంట్ వి.రాజన్నకు గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేయనున్నారు. అలాగే 2023-2024 విద్యా సంవత్సరంలో పట్ట భద్రులైన విద్యార్థులకు కూడా పట్టాలు అందించనున్నారు.

పలువురికి డాక్టరేట్లు ప్రదానం

బుధవారం ఉదయం 10.30 గంటల నుంచి అలూమిని ఆడిటోరియంలో ఈ కార్యక్రమం ప్రారంభం కానుందని వీసి ప్రసాదరాజు తెలిపారు. ఈ సందర్భంగా ఉత్తీర్ణులైన విద్యార్థులకు డిగ్రీలు ప్రదానం చేస్తామన్నారు. ఈ స్నాతకోత్సవంలో 64 మంది రీసెర్చ్ స్కాలర్స్ పిహెచ్‌డి డిగ్రీలు అందుకోనున్నారు. అలాగే ఛాన్సలర్, ఇతర అతిథుల సమక్షంలో ప్రతిభావంతులైన విద్యార్థులకు ఎండోమెంట్ అవార్డులు, బంగారు పతకాలను అందిస్తామని తెలిపారు. బిటెక్‌లో 34,199 మంది, బి-ఫార్మసీలో 1,477 మంది, ఎంటెక్‌లో 1,689 మంది, ఎంబిఎలో 1,093 మంది, ఎంసిఎలో 343 మంది, ఎం.ఫార్మసీ లో 332, బిబిఎలో 21, ఫార్మా-డిలో 182, బి. ఆర్క్‌లో 13, బంగారు పతకాలు 28 మంది అందుకోనున్నారు.

ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నాం



10వ స్నాతకోత్సవాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. కార్యక్రమం నిర్వహణకు ఇప్పటికే కొన్ని కమిటీలను ఏర్పాటు చేశాం. ఎవరికీ ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నాం. ప్రపంచంలోనే పేరు ప్రతిష్టలున్న టిసిఎస్ ప్రెసిడెంట్ వి.రాజన్నకు గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేయడం సంతోషంగా ఉంది.

- జివిఆర్ ప్రసాదరాజు, వైస్ ఛాన్సలర్, జెఎన్‌టియుకె.

రాజన్నకు గౌరవ డాక్టరేట్



గౌరవ డాక్టరేట్ అందుకునేందుకు వస్తున్న టిసిఎస్ టెక్నాలజీ, సాఫ్ట్‌వేర్ అండ్ సర్వీసెస్ ప్రెసిడెంట్ వి.రాజన్న బహుముఖ ప్రజ్ఞాశాలిగా 30ఏళ్ల నుంచి పరిశ్రమలు, విద్యా వ్యవస్థలు, ప్రభుత్వ విభాగాల్లో తనదైన శైలిలో ముద్ర వేశారు. సేల్స్, డెలివరీ, బిజినెస్ ఆపరేషన్స్, మానవ వనరులు, పరిశోధనాభివృద్ధి, మార్కెటింగ్, ఆర్థిక పరమైన సుస్థిరత, విద్య తదితర అంశాలలో అమెరికా, తైవాన్, చైనా, సింగపూర్ తదితర దేశాలు ఆయన సాంకేతిక అనుభవాన్ని వినియోగించుకుంటున్నాయి. ప్రస్తుతం ఆయన టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టిసిఎస్)లో సీనియర్ వైస్ ప్రెసిడెంట్‌గా, గ్లోబల్ హెడ్ ఆఫ్ ది కమ్యూనికేషన్స్, మీడియా, టెక్నాలజీ బిజినెస్ గ్రూపులకు తన సేవలను అందిస్తున్నారు. దీనికి ముందుగా రాజన్న టెలీకాం ఒఇఎం బిజినెస్ యూనిట్‌కు నేతృత్వం వహించి ఆ యూనిట్‌కు రెండున్నర రెట్ల ఆదాయాన్ని సమకూర్చారు. 15ఏళ్లుగా రాజన్న ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల్లో టిసిఎస్ రీజనల్ హెడ్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. ఎపిటి ఆన్‌లైన్ ఛైర్మన్‌గా వ్యవహరిస్తూ విజయవాడలోని ఎపిటి ఆన్‌లైన్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను నెలకొల్పడంలో కీలక పాత్ర పోషించారు. ఆయన నాయకత్వంలో హైదరాబాద్‌లోని టిసిఎస్ ప్రపంచ స్థాయిలో 32 స్థానం సంపాదించడంతోపాటు 4,500 ఉద్యోగాల నుంచి 90 వేల ఉద్యోగాలు కల్పించి విజయబావుటాను ఎగురవేసింది. ఆసియా-పసిఫిక్ రీజియన్‌కు టిసిఎస్ డెలివరీ అండ్ ఆపరేషన్స్ విభాగంలో రాజన్న జనరల్ మేనేజర్‌గా ఉంటూ బిజినెస్ ఎక్స్‌లెన్స్, మెథడాలజీస్, ఎంఐఎస్‌లో వినూత్నమైన సేవలు అందించారు. చైనాలోని టిసిఎస్‌లో రాజన్న సిఇఓగా సేవలందించి సిఎంఎంఐ అండ్ పిసిఎంఎం లెవెల్ -5లో ఐఎస్‌ఒ సర్టిఫికేషన్ వచ్చేలా కృషి చేశారు.



అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ బుల్లిరాజుకి వినతిపత్రాన్ని అందజేస్తున్న సిఐటియు నాయకులు

సమస్యలను పరిష్కరించకుంటే పోరాటమే

ప్రజాశక్తి - కాకినాడ

భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించకుంటే పోరాటమే శరణ్యమని ఎపి భవన, ఇతర నిర్మాణ కార్మికుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రొంగల ఈశ్వరరావు అన్నారు. కాకినాడ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ బుల్లిరాజుకి ఈ మేరకు మంగళవారం వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా సంఘ కార్యనిర్వాహక అధ్యక్షులు చెక్కల రాజ్ కుమార్, జిల్లా సహాయ కార్యదర్శి మేడిశెట్టి వెంకటరమణ మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం భవననిర్మాణ కార్మికులకు ఈ ఐదేళ్ల కాలంలో తీవ్ర అన్యాయం చేసిందని, కార్మికుల దాచుకున్న లేబర్ సెస్ రూ.2,500 కోట్లను దొడ్డిదారిన తన అవసరాలకు దారి మళ్లించిందన్నారు. కార్మికుల కుటుంబాలకు చెల్లించాల్సిన ప్రసూతి సాయం, వివాహ బహుమతులు, సహజ మరణం, ప్రమాద మరణాల పరిహారాలను చెల్లించకుండా అన్ని పథకాలను 1214 మెమో ద్వారా సిఎం నిలుపుదల చేయించారని విమర్శించారు. కార్మికశాఖ అధికారులకు, సచివాలయ సిబ్బందికి, అధికార పార్టీ ఎంఎల్ఎలకు, రాష్ట్ర మంత్రుల దృష్టికి కార్మికుల సమస్యలను తీసుకెళ్లినా చలనం లేకుండా పోయిందన్నారు. నవరత్నాల పేరుతో 10 మందికి పథకాలు ఇచ్చి రాష్ట్ర వ్యాప్తంగా 25 లక్షల మంది భవన నిర్మాణ కార్మికుల కుటుంబాలను రోడ్డున పడేశారని విమర్శించారు. ఫిబ్రవరిలో జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల సందర్భంగా కార్మికులందరూ పోరాటానికి సిద్ధపడాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కోశాధికారి మలకా రమణ, కాకినాడ రూరల్ మండల నాయకులు టి.రాజా పాల్గొన్నారు.

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన

ప్రజాశక్తి - పెద్దాపురం



వ్యవసాయ ప్రదర్శన చేస్తున్న విద్యార్థులు

వ్యవసాయ రంగంలో నూతనంగా వస్తున్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. రాజమహేంద్రవరం వ్యవసాయ కళాశాల విద్యార్థుల ఆధ్వర్యంలో రైతు సదస్సు-ప్రదర్శన కార్యక్రమాన్ని మండలంలోని గోరింట గ్రామంలో మంగళవారం నిర్వహించారు. ఈ సదస్సులో వ్యవసాయ కళాశాల డీన్ డాక్టర్ చవాన్ శ్యామ్‌రావ్‌నాయక్ మాట్లాడుతూ అభ్యుదయ రైతుల కమతంలో వార [illegible] సత్యంగా వస్తున్న సాంప్రదాయ వ్యవసాయ విధానాలను విద్యార్థులు నేర్చుకుంటారని అన్నారు. రైతుల నుంచి నేర్చుకుని వాటికి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం జత కలిపి తక్కువ నీటితో, తక్కువ పెట్టుబడితో నాణ్యమైన అధిక దిగుబడులు ద్వారా అధికాదాయం పొందేలా రైతులకు అవగాహన కల్పిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఏరువాక కేంద్రం కో-ఆర్డినేటర్ డాక్టర్ సిహెచ్.వి. నరసింహారావు, సర్పంచ్ పి.సతీష్ కుమార్, వ్యవసాయ పరిశోధన కేంద్రం అధిపతి డాక్టర్ పి. మునిరత్నం, ప్రధాన శాస్త్రవేత్తలు డాక్టర్ టి.ఉషా రాణి, డాక్టర్ ఎ.సీతారామ శర్మ, వ్యవసాయ అధికారి కె.సంజయ్‌కుమార్ పాల్గొన్నారు.



లబ్ధిదారులకు గ్యాస్ స్టౌవ్‌ను అందిస్తున్న నిర్వాహకులు

'ఉజ్వల' కనెక్షన్ల పంపిణీ

ప్రజాశక్తి - పెద్దాపురం

వికసిత్ భారత సంకల్ప యాత్రలో భాగంగా మంగళవారం గంగా హెచ్‌పి గ్యాస్ కంపెనీ మేనేజింగ్ పార్టనర్ తలాటం గంగాధరరావు నేతృత్వంలో లబ్ధిదారులకు హెచ్‌పి గ్యాస్ కనెక్షన్లు పంపిణీ చేశారు. స్థానిక కొత్తపేటలోని రామాలయంలో మున్సిపల్ కమిషనర్ కెవి.పద్మావతి అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కమిషనర్ కేంద్ర ప్రభుత్వం ద్వారా అమలు జరుగుతున్న పథకాలపై అవగాహన కల్పించారు. అర్హులైన లబ్ధిదారులందరూ ఈ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో విత్తనాల వెంకటరమణ, అల్లు ప్రసాద్, చెరుకూరి రవికృష్ణ, దుర్గా మోహన్‌రావు పాల్గొన్నారు.

2న ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - యు. కొత్తపల్లి

మండలంలోని ఎండపల్లి గ్రామంలో ఫిబ్రవరి 2న మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు విష్ణు హాస్పిటల్స్ అధినేత, జనసేన నాయకుడు పిల్ల శ్రీధర్ తెలిపారు. ఈ మేరకు గోడపత్రికను మంగళవారం ఆయన విడుదలచ ఏశారు. మెగా ఉచిత వైద్య శిబిరాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని ఆయన సూచించారు ఈ కార్యక్రమంలో డాక్టర్ అనుదీప్, పిల్ల శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

పోర్టు భూములన్నీ కబ్జా



కబ్జా భూమిని చూపిస్తున్న మాజీ ఎంఎల్ఎ కొండబాబు

ప్రజాశక్తి - కాకినాడ

పోర్టు భూములన్నీ కబ్జా చేయడానికే ఎంఎల్ఎ ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డికి కన్పిస్తాయని, నగర అభివృద్ధికి మాత్రం కన్పించవని మాజీ ఎంఎల్ఎ వనమాడి కొండబాబు ఎద్దేవా చేశారు. ఎలక్ట్రికల్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి దుమ్ములపేట ప్రాంతంలో 1:4 టిడిఆర్ బాండ్లు మంజూరు చేసి కార్పొరేషన్ సేకరించిన 4.67 ఎకరాల భూమిని ఎంఎల్ఎ ద్వారంపూడి కబ్జా చేసిన పోర్టు భూములను మంగళవారం ఆయన పాత్రికేయులకు చూపించారు. ఈ సందర్భంగా కొండబాబు మాట్లాడుతూ కబ్జా చేయడానికి కనిపించిన పోర్టు భూములు సబ్ స్టేషన్ నిర్మాణానికి కనిపించలేదని అన్నారు. ఎలక్ట్రికల్ సబ్‌స్టేషన్ పేరుతో ఎందుకు పనికిరాని ప్రయివేటు భూమిని సేకరించి వాటికి రూ.251 కోట్ల విలువ చేసే బాండ్లు మంజూరు చేయించి కార్పొరేషన్ ఖజానాన్ని కొల్లగొట్టారని ధ్వజమెత్తారు. టిడిపి పాలనలోనే జిఒ వచ్చిందని చెబుతున్న ద్వారంపూడి ప్రజాఉపయోగాల కోసమే ఆ జిఒ అని, ఎంఎల్ఎ దోచుకోవడానికి కాదని గుర్తుంచుకోవాలన్నారు. టిడిఆర్ బాండ్లతో మున్సిపాలిటీకి గాని, ప్రభుత్వ ఖజానాకు కానీ నష్టం లేదని చెబుతున్న ద్వారంపూడి అదే వాస్తవమైతే టిడిఆర్ బాండ్లు దేనికి ఇచ్చినట్టన్నారు. ఎలక్ట్రికల్ సబ్‌స్టేషన్ ఏర్పాటుకు కాకినాడ నగరంలో పోర్ట్ భూములు చాలా ఉన్నాయని, గతంలో పూలే పాకాల వద్ద సుమారు 8 ఎకరాలు పోర్ట్ భూమిని రాత్రికి రాత్రి ఫిల్లింగ్ చేసి కబ్జా చేస్తే, తాము అధికారులు దృష్టికి తీసుకువెళ్లి పోర్టు భూములను కాపాడడం జరిగిందన్నారు. ఆ భూములు ఎలక్ట్రికల్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి పనికిరావా? అని కొండబాబు ప్రశ్నించారు. గత ప్రభుత్వ పాలనలో కాకినాడ - సామర్లకోట రోడ్డు విస్తరణకు, కొండయ్యపాలెం ఫ్లై ఓవర్ నిర్మాణానికి, మెయిన్ రోడ్డు విస్తరణకు, రాష్ట్ర ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయించి భూములను సేకరించి నగర అభివృద్ధికి కృషి చేశామని, ఆయనలాకార్పొరేషన్ ఖజానా కొల్లగొట్టే విధంగా టిడిఆర్.బాండ్లు మంజూరు చేయలేదన్నారు. పోర్టు భూములను సేకరించి టిడ్కో గృహాలను నిర్మించామని, నేడు ఆ గృహాలకే రంగులు వేసుకుని గొప్పలు చెప్పుకోవడానికి ఎంఎల్ఎ సిగ్గుపడాలని అన్నారు. సబ్ స్టేషన్ కోసం 4.67 ఎకరాలు సేకరించినందుకు అధికారులకు సన్మానం చేస్తానని ద్వారంపూడి చెబుతున్నాడని, సురేష్ నగర్ పార్క్ ప్రభుత్వ భూమిపై రూ.160 కోట్లు, సబ్‌స్టేషన్ పేరుతో రూ.251 కోట్లు విలువ చేసే టిడిఆర్ బాండ్లు మంజూరు చేసి ప్రజా ధనాన్ని దోచుకోవడానికి అవకాశం కల్పించిన అధికారులకు ఒక్క సన్మానం ఏమిటి ఇంకేమైనా చేస్తాడని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షులు మల్లిపూడి వీరు, తుమ్మల రమేష్, ఒమ్మి బాలాజీ, బంగారు సత్యనారాయణ, చోడిపిల్లి సతీష్, కొండ్రు తాతారావు, ఎరుపిల్లి సత్తిబాబు, చోడిపిల్లి ప్రేమానందం, తదితరులు పాల్గొన్నారు.

'సంభవ్' ఆధ్వర్యంలో స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం

ప్రజాశక్తి - కాకినాడ



విద్యార్థులతో పాల్గొన్న జయకుమార్

సౌత్ హెడ్ సంభవ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం రాజ రాజేశ్వరి ఐటిఐ ప్రాంగణంలో కెరీర్ స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం జరిగింది. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సిఎస్ఆర్ మేనేజర్ జయ కుమార్ పాల్గొని ప్రారంభించి మాట్లాడారు. ఎస్ఎల్‌బి యొక్క కార్పొరేట్ సామాజిక బాధ్యతగా ఇప్పటి వరకు తాము స్టడీ మెటీరియల్, ప్రాక్టికల్ మెటీరియల్, అవసరమైన వారికి ల్యాప్‌టాప్‌లను అందించడం జరుగుతుందన్నారు. తాము సొసైటీలో సుస్థిరతను తీసుకురావడానికి కెరీర్ స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌ను ప్రారంభించడం జరుగుతుందన్నారు. రెండు సంవత్సరాల ఐటిఐ పూర్తయిన తర్వాత కెరీర్ లక్ష్యాలను చేరుకోవడానికి విద్యార్థులకు కెరీర్ స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ చాలా మంచి అవకాశమన్నారు. కెరీర్ స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌లో మౌఖిక, అశాబ్దిక కమ్యూనికేషన్, రెజ్యూమ్‌తో కూడిన కమ్యూనికేషన్ స్కిల్స్ ఉంటాయన్నారు. ప్రిపరేషన్, ఇంటర్వ్యూ స్కిల్స్, రెజ్యూమ్ ప్రిపరేషన్స్ మొదలైన వాటిపై విద్యార్థులకు పూర్తిగా శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. తద్వారా విద్యార్థులు చదువు పూర్తయిన వెంటనే ఉద్యోగ ఉపాధి అవకాశాలను పొందే అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో రాజరాజేశ్వరి ఐటిఐ ప్రిన్సిపల్ బాల గణేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజా ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి - కోటనందూరు



కిట్లను పంపిణీ చేస్తున్న ఎంపిపి శ్రీనివాస్

ప్రజారోగ్యమే ప్రభుత్వ లక్ష్యమని ఎంపిపి లగుడు శ్రీనివాస్ అన్నారు. మంగళవారం స్థానిక సర్పంచ్ గరిసింగు శివలక్ష్మి దొరబాబు ఆధ్వర్యంలో జెఎఎస్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన జెఎఎస్ కార్యక్రమాన్ని ప్రజల సద్వినియోగం చేసుకోవాలన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా వైద్య రంగానికి నిధులు కేటాయింపులు జరుగుతున్నాయని అన్నారు. ఆరోగ్య శ్రీలో రూ.25 లక్షల వరకూ వైద్యాన్ని ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ వైద్య అధికారిని ఎం.యామిని కావ్య, తుని మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ వెలగా వెంకటకృష్ణ, వైస్ ఎంపిపి కె.రమణమ్మ, ఎంపిటిసి సభ్యులు ఎం. సునీత, మండల వ్యవసాయ సలహా చైర్మన్ సుర్ల రాజు, ఉప సర్పంచ్ డి.సూర్యచంద్ర, హైస్కూల్ చైర్మన్ యు.శ్రీను, పాల్గొన్నారు.

శాశ్వతంగా నిలిచిపోయే పనులు చేపడతా

ప్రజాశక్తి - జగ్గంపేట రూరల్



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంఎల్ఎ నెహ్రూ

చరిత్రలో శాశ్వతంగా నిలిచిపోయే పనులను చేపడతానని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ అన్నారు. మండలంలోని గొల్లలగుంటలో వైసిపికి చెందిన పలువురు టిడిపిలో చేరారు. ఈ సందర్భంగా వారికి జ్యోతుల టిడిపి కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగు అంశాలతో ప్రణాళికను రూపొందించానని, నియోజకవర్గానికి పూర్తి స్థాయిలో తాగు నీరు, సామాన్యులకు అందుబాటులో ఉండేలా మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి, డిగ్రీ నుంచి పిజి వరకూ విశ్వ విద్యాలయం, నిరుద్యోగుల ఉపాధి కోసం నాలుగు మండలాల్లో పరిశ్రమలు ఏర్పాటు చేస్తామన్నారు. గతంలో ఎంఎల్ఎగా సాగు, తాగు నీరు ప్రాజెక్టులను తీసుకొచ్చానని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో తాను పోటీ చేస్తున్నానని, తన గెలుపునకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో భద్రం, అప్పలరాజు, కె.కొండబాబు, మురళి, జీను మణి బాబు, తదితరులు పాల్గొన్నారు.

ఆదిత్యను సందర్శించిన హేమచంద్రారెడ్డి

ప్రజాశక్తి - గండేపల్లి

సూరంపాలెంలో ఆదిత్యా విద్యా ప్రాంగణాన్ని ఎపి స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఛైర్మన్ డాక్టర్ కె. హేమచంద్రారెడ్డి సందర్శించారు. ఆయనకు ఆదిత్య విద్యా సంస్థల అధినేత డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, డిగ్రీ కళాశాలల డైరెక్టర్ డాక్టర్ ఎన్.సుగుణరెడ్డి, ఆదిత్య గ్రూప్ ఆఫ్ ఇంజనీరింగ్ కళాశాలల ప్రిన్సిపల్స్ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వివిధ విభాగాల విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్టులను ఆయన పరిశీలించారు. ఆదిత్య టెక్నికల్ హబ్ ద్వారా విద్యార్థులకు నూతన టెక్నాలజీ పై అందిస్తున్న కోర్సులను తెలుసుకుని అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నూతన ఆవిష్కరణలు, ప్రపంచంలో జరుగుతున్న విజ్ఞానాభివృద్ధిని తెలుసుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి, డాక్టర్ డోలా సంజయ్, డాక్టర్ ఆదిరెడ్డి రమేష్, బాబ్జీ నీలం తదితరులు పాల్గొన్నారు.

రాబోయే ఎన్నికల్లో టిడిపిని గెలిపించండి

ప్రజాశక్తి - రౌతులపూడి

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి అభ్యర్థిగా తనను గెలిపించాలని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ వరుపుల సత్యప్రభ ప్రజలను కోరారు. మండలంలోని మల్లంపేటలో 'మీకోసం మీ సత్యప్రభ' కార్యక్రమంలో భాగంగా మంగళవారం 'భవిష్యత్తుకు హామీ బాబు ష్యూరిటీ' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మేనిఫెస్టో కరపత్రాలను ప్రజలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో తనకు ఒక అవకాశం ఇవ్వాలని కోరారు. అనంతరం వైసిపి నాయకులు శ్రీరామ్‌రెడ్డి, స్వామి నాయుడుతోపాటు 50 మంది కార్యకర్తలు టిడిపిలో చేరారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి గంటిమల రాజ్యలక్ష్మి, టిడిపి అధ్యక్షులు సత్యనారాయణ, మాజీ ఎంపిపి భాస్కర్ బాబు, స్థానిక నాయకులు లావరాజు. రెడ్డి రాజ గోవిందు ఉన్నారు.

ఆసరాతో మహిళల ఆర్థికాభివృద్ధి

ప్రజాశక్తి - పిఠాపురం


మహిళల ఆర్థికాభివృద్ధికి వైఎస్ఆర్ ఆసరా దోహదం చేస్తుందని ఎంపి వంగా గీత, ఎంఎల్ఎ పెండెం దొరబాబు అన్నారు. వైసిపి కార్యాలయంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ గండేపల్లి సూర్యావతి అధ్యక్షతన డ్వాక్రా మహిళలకు ఆసరా పథకం 4వ విడత రుణమాఫీ చెక్కుల పంపిణీ కార్యక్రమం మంగళవారం జరిగిందిఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జ్ కమిషనర్ భవానీశంకర్, వైసిపి మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు వర్ధినీడి సుజాతా, మున్సిపల్ వైస్ ఛైర్‌పర్సన్లు పచ్చిమళ్ళ జ్యోతి, కొత్తపల్లి పద్మావతి, కౌన్సిలర్లు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

ప్రమాదాలకు తావు లేకుండా చర్యలు

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

రైల్వే ప్రయాణాల్లో ఎటువంటి ప్రమాదాలకు ఆస్కారం లేకుండా భద్రతా చర్యలు తీసుకోవాలని కాకినాడ రైల్వే లైన్స్ ఇన్‌స్పెక్టర్ గౌస్ బేగ్ ఆదేశించారు. మంగళవారం సాయంత్రం సామర్లకోట రైల్వే స్టేషన్లో రైల్వే భద్రత, ప్రయాణికుల భద్రత తదితర అంశాలపై రైల్వే అధికారులు, జిఆర్‌పి, ఆర్‌పిఎఫ్ సిబ్బందికి రైల్వేస్టేషన్ మేనేజర్ ఎం.రమేష్ అధ్యక్షతన అవగాహన సదస్సు నిర్వహించారు.

కార్టూ'నిజం'



గాంధీకి ఘన నివాళి

ప్రజాశక్తి - యంత్రాంగం



జగ్గంపేటలో గాంధీ, పొట్టి శ్రీరాముల విగ్రహాల వద్ద నివాళి

మహాత్మ గాంధీ వర్ధంతి సందర్భంగా జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఆయన విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. **కరప** మండలంలోని గురజనాపల్లి జడ్‌పి ఉన్నత పాఠశాలలో గాంధీ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో స్టాఫ్ సెక్రటరీ ఐ.ప్రసాదరావు, హెచ్ఎం ఎ.సాయి మోహన్, ఉపాధ్యాయులు వివి.రమణమూర్తి, జి.అర్జునరావు, ఎ.సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు. **పెద్దాపురం** స్థానిక మెయిన్ రోడ్‌లోని మహాత్మా గాంధీ విగ్రహానికి కార్మిక సంఘాల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు సిరపరపు శ్రీనివాస్, డి.క్రాంతి కుమార్, కూనిరెడ్డి అప్పన్న, ప్రజానాట్యమండలి నాయకులు డి.కృష్ణ, ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు చింతల సత్యనారాయణ,మరిడమ్మ తల్లి పెయింటింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు తైనాల శ్రీను, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు కాలే దేవి పాల్గొన్నారు. **తాళ్లరేవు** గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని వాసవి క్లబ్ కపుల్స్ ఆధ్వర్యంలో నామన వెంకాయమ్మ జడ్‌పి హైస్కూల్లో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత గాంధీ విగ్రహానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ప్రెసిడెంట్ అద్దేపల్లి సుధ, సెక్రటరీ దాసరి భారతి, ట్రెజరర్ గోకవరపు శ్రీదేవి, సామా ప్రకాష్, గోకవరపు సుభాష్, తదితరులు పాల్గొన్నారు. **జగ్గంపేట రూరల్** ఆర్యవైశ్య కళ్యాణ మండపం వద్ద గాంధీ వర్ధంతి కార్యక్రమంలో భాగంగా గాంధీ, పొట్టి శ్రీరాములు విగ్రహాలకు ఆర్యవైశ్య సేవా సంఘం అధ్యక్షులు కొత్త కొండబాబు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నూకాబాబు, బొండా వీరసత్య, కొత్త సుధీర్, దారా శ్రీనివాస్, పాల్గొన్నారు.

ఆల్ రౌండ్ ఛాంపియన్‌గా తాళ్లరేవు



నగదు బహుమతి చెక్‌ను అందుకుంటున్న క్రీడాకారులు

ప్రజాశక్తి - తాళ్లరేవు

నియోజకవర్గస్థాయి ఆడుదాం ఆంధ్ర ఆటల పోటీల్లో తాళ్ళరేవు మండలం ఆల్ రౌండ్ ఛాంపియన్ షిప్ సాధించింది. మండలం నుంచి నియోజవర్గ స్థాయి ఆటల పోటీల్లో పురుషులు, మహిళల విభాగాల నుంచి క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, కోకో, బ్యాడ్మింటన్ ఆటల్లో 10 జట్లు పాల్గొన్నాయి. ఈ మేరకు పురుషుల విభాగంలో క్రికెట్, కబడ్డీ, కోకో, వాలీబాల్ ఆటల్లో విన్నర్స్‌గా నిలవగా, బ్యాడ్మింటన్‌లో రన్నర్ స్థానాన్ని సాధించారు. మహిళల విభాగంలో బ్యాడ్మింటన్‌లో విన్నర్‌గా నిలువగా, కోకో, కబడ్డీలో రన్నర్ స్థానాన్ని దక్కించుకున్నాయని ఎంపిడిఒ ఎం.అనుపమ తెలిపారు. మొత్తంగా తాళ్లరేవుకు ఆరు విన్నర్స్, రెండు విభాగాల్లో రన్నర్స్ స్థానాలు దక్కాయి. ఆటల్లో గెలుపొందిన క్రీడాకారులకు ఎంఎల్ఎ సతీష్ కుమార్ నియోజకవర్గస్థాయి ట్రోఫీలను, నగదు బహుమతులను అందజేశారు. తాళ్ళరేవుకు గుర్తింపు తీసుకొచ్చిన క్రీడాకారులను ఎంపిపి రాయుడు సునీత అభినందించారు.

నేరాలు ఘోరాలు

పురుగుల మందు తాగిన వివాహిత మృతి

ప్రజాశక్తి-కొత్తపేట

పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వివాహిత పరిస్థితి విషమించడంతో మృతి చెందిందని కొత్తపేట ఎస్‌ఐ డి.జ్వాలా సాగర్ తెలిపారు. మండలంలోని మోడేకుర్రు గ్రామ శివారు గొలకోటివారిపాలానికి చెందిన గొలకోటి హేమభద్రరావుతో సత్యాదేవికి ఆరు సంవత్సరాల క్రితం వివాహమైంది. కొంతకాలంగా సత్యదేవి కడుపు నొప్పితో బాధపడుతోంది. ఈనెల 24న కడుపు నొప్పిని తాళలేక పురుగుల మందు తాగింది. స్థానికులు వెంటనే ఆమె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం రాజమహేంద్రవరంలో ప్రయివేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ ఈ నెల 29న పరిస్థితి విషమించడంతో మృతి చెందింది. ఆమెకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతురాలి తల్లి చవాకులు సూర్యావతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

సారా తరలిస్తున్న ఇద్దరు అరెస్ట్

ప్రజాశక్తి-ఆత్రేయపురం

సారాను తరలిస్తున్న ఇద్దరిని పోలీసులు అదుపులో తీసుకున్నారు ఎస్‌ఇబి, పోలీసులు సంయుక్తంగా మంగళవారం మండలంలోని లంక గ్రామాల్లో సారా స్థావరాలపై దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో వెలిచేరు, ఆత్రేయపురం శివారు కుమ్మరిగూడెంలో సారా విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేశారు. వారి నుంచి 15 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి కొత్తపేట కోర్టులో ప్రవేశపెట్టారు. న్యాయమూర్తి వారికి 14 రోజులు రిమాండ్ విధించారని ఎస్‌ఐ బివై.కిరణ్ కుమార్ తెలిపారు.

ఉద్యోగిపై దాడి ఘటనలో కేసు నమోదు

ప్రజాశక్తి - యు. కొత్తపల్లి

మత్స్యశాఖ సహాయకుడు పరుశురాంపై వైసిపి నాయకుడు రావు చిన్నారావు, వైసిపి కార్యకర్తలు దాడి చేసిన ఘటనలో పోలీసులు కేసు నమోదు చేశారు. బాధితుడు పరుశురామ్‌పై సోమవారం ఉన్నతాధికారుల సమక్షంలోనే వైసిపి నాయకుడు రావు చిన్నారావు, ఆయన అనుచరులు దాడి చేసిన సంఘటన తీవ్ర సంచలనం సృష్టించింది. దీనిపై బాధితుడుతోపాటు, మత్స్య శాఖ ఉన్నతాధికారి సోమవారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే రాజకీయ ఒత్తిళ్లతో పోలీసులు వారిచ్చిన ఫిర్యాదును తీసుకునేందుకు సిద్ధపడలేదు. కేసు పెట్టకుండా బాధితుడిపై తీవ్రమైన ఒత్తిడి తీసుకొచ్చినట్లు సమాచారం. సోమవారం రాత్రి దాడికి పాల్పడిన రావు చిన్నారావు బాధితుడికి క్షమాపణ చెప్పినట్లు ప్రచారం జరిగింది. అయితే మంగళవారం ఉద్యోగ సంఘ నాయకులతో బాధితుడు పరుశురామ్ స్టేషన్‌కు వచ్చి రొయ్యల చెరువులకు రాయితీ ఇవ్వలేదన్నా అక్కసుతో తనపై వైసిపి నాయకుడు రావు చిన్నారావు, ఆయన అనుచరులు దుర్భాషలాడుతూ దాడి చేశారని ఫిర్యాదు చేశారు. ఈ సంఘటనపై పిఠాపురం సిఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో విచారణ ప్రారంభించారు. ప్రాథమిక విచారణ అనంతరం ఎస్‌ఐ స్వామి నాయుడు కేసు నమోదు చేశారు.

స్టేషన్‌లో లొంగిపోయిన గంజాయి కేసు నిందితుడు

ప్రజాశక్తి - గండేపల్లి

గంజాయి కేసులో నిందితుడు స్థానిక పోలీస్‌స్టేషన్లో లొంగిపోయాడు. ఈ నెల 22న పాడేరు ప్రాంతం నుంచి గుంటూరుకు గంజాయిని రవాణా చేస్తూ గండేపల్లి శివారులో పోలీసులు తనిఖీల్లో షేక్ బాజీబాబా అనే వ్యక్తి దొరికిపోయాడు. ఈ రవాణాలో మరో ముద్దాయి అయిన గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం కొలనుకొండ గ్రామానికి చెందిన ముక్కాల ప్రకాశరావు తప్పించుకుని పారిపోయాడు. అయితే మంగళవారం సాయంత్రం 4 గంటల సమయంలో ఆ ముద్దాయి గండేపల్లి పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయాడు. జగ్గంపేట సిఐ లక్ష్మణరావు, ఎస్‌ఐ ఎన్.రామకృష్ణ ఆధ్వర్యంలో ఆ ముద్దాయిని కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

వెండి వస్తువులు, నగదు సీజ్

ప్రజాశక్తి-కడియం

కడియం మండలం పొట్టిలంక గ్రామం జాతీయ రహదారి వద్ద ఏర్పాటు చేసిన తాత్కాలిక చెక్ పోస్ట్‌లో మంగళవారం సోదాలు నిర్వహిస్తుండగా, ఒక కారులో బిల్లులు లేకుండా తీసుకుని వెళ్తున్న రూ.1.50 లక్షల నగదు, మరో కారులో ఎటువంటి బిల్లులు లేకుండా తీసుకుని వెళ్తున్న 6 కేజీల వెండి వస్తువులను సీజ్ చేసినట్లు కడియం సిఐ తులసీధర్ తెలిపారు. వెండివస్తువులు విలువ రూ.4లక్షలు ఉంటుందన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ఎవరైనా ఎక్కువ మొత్తంలో నగదు గాని, వస్తువులు గాని తీసుకుని వెళ్లేటప్పుడు తగిన ఆధారాలను వెంట పెట్టుకోవాలన్నారు. లేకుంటే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ తనిఖీల్లో కడియం ఎస్‌ఐ అశ్వాక్, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

కోతలు లేకుండా కనీస వేతనాలు ఇవ్వాలి

ప్రజాశక్తి - కాకినాడ



డిఎంకు వినతిపత్రం అందించిన యూనియన్ నాయకులు

ఎపిఎస్ఆర్‌టిసి కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని సిఐటియు నాయకులు కోరారు. ఎపిఎస్ఆర్‌టిసి కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కన్వీనర్ వి.తులసీరామ్, సిఐటియు జిల్లా కోశాధికారి మలక వెంకటరమణ, నగర సిఐటియు అధ్యక్షులు పలివెల వీరబాబు ఆర్‌టిసి డిఎంని కలిసి సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాకినాడ ఆర్‌టిసి డిపోలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ కార్మికులకు వేతనాలు చెల్లించే విషయంలో చట్ట ప్రకారం వేతనాలు చెల్లించకుండా వేతనాల్లో కోతలు విధిస్తున్నారని అన్నారు. ఈ కోతల విధించడం అధికారులు అరికట్టాలని అన్‌స్కిల్డ్, సెమీ స్కిల్డ్, స్కిల్డ్, డేటా ఎంట్రి ఆపరేటర్స్, స్వీపర్స్‌కి ఇచ్చే వేతనాల్లో కాంట్రాక్టర్లు భారీ సంఖ్యలో కోత విధించి వేతనాలు ఇస్తున్నారని తెలిపారు. చట్ట ప్రకారం ఇవ్వవలసిన వేతనాలను ఎటువంటి కోతలు లేకుండా ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సిఐటియు ఆధ్వర్యంలో ఉద్యోగులు కార్మికుల పక్షాన పోరాడడానికి సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు. పబ్లిక్ హాలిడేస్ వంటి సెలవులను కూడా సక్రమంగా ఇవ్వట్లేదని అన్నారు. విశాఖ వంటి డిపోలో అవుట్‌సోర్సింగ్ కార్మికులకు చట్ట ప్రకారం వేతనాలు చెల్లిస్తున్నారని, దానిని పరిగణలోకి తీసుకుని కాకినాడ డిపోలో కూడా కనీస వేతనాలు అమలయ్యే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.

గ్రంథాలయాలను ఆధునికీకరించాలి

ప్రజాశక్తి - కాకినాడ

పాఠకుల్లో పుస్తక పఠనాశక్తిని పెంచేలా గ్రంథాలయాల్లో సదుపాయాలను ఆధునీకరించాలని జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా గ్రంథాలయ సంస్థ బడ్జెట్, సర్వసభ్య సమావేశం సంస్థ పర్సన్ ఇన్‌ఛార్జ్, జెసి ఎస్.ఇలక్కియ అధ్యక్షతన జరిగింది. జిల్లా గ్రంథాలయ సంస్థ 2023-24 సంవత్సరానికి సవరించిన బడ్జెట్ అంచనాలు, 2024-25 సంవత్సరానికి బడ్జెట్ ప్రతిపాదనలపై చర్చించి ఆమోదించారు. వివిధ ప్రభుత్వ గ్రాంటులు, గ్రంథాలయ సెస్ నిధులతో పుస్తకాలు, పత్రికల కొనుగోళ్లు, శాఖా గ్రంథాలయాల భవనాలకు మరమ్మతులు, అద్దెల చెల్లింపు, సిబ్బంది జీత భత్యాలు తదితర పద్దులతో ప్రతిపాదనలను రూపొందించారు. జిల్లాలో శాఖా గ్రంథాలయాలు, గ్రామీణ గ్రంథాలయాలు లేని చోట్ల పుస్తక పంపిణీ కేంద్రాలు ఏర్పాటు, కేర్ టేకర్‌ల నియామకానికి ఆమోదం తెలిపారు. పాఠకులు, విద్యార్థులకు అవసరాలు, అభిరుచులకు అనుగుణమైన పుస్తకాలను అందుబాటులో ఉంచి, మెరుగైన వసతులతో గ్రంథాలయాలను అభివృద్ధి చేసేందుకు ప్రణాళిక రూపొందించారు. అందుకు అవసరమైన నిధులు కొరకు బడ్జెట్‌లో ప్రతిపాదించాలని జెసి ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వివిఎల్ఎన్ఎస్.వరప్రసాద్, విద్య, పంచాయితీ, వయోజన విద్య, సమాచార పౌర సంబంధాల శాఖల అధికారులు పాల్గొన్నారు.

క్రీడలను ప్రోత్సహించేందుకే 'ఆడుదాం ఆంధ్ర'

ప్రజాశక్తి - పెద్దాపురం

యువతను క్రీడల్లో ప్రోత్సహించేందుకే రాష్ట్ర ప్రభుత్వం ఆడుదాం ఆంధ్ర పోటీలను నిర్వహిస్తుందని వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ దవులూరు దొరబాబు అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ బి.అశోక్ కుమార్ అధ్యక్షతన జరిగిన నియోజకవర్గస్థాయి ఆడుదాం ఆంధ్ర పోటీల్లో విజేతలకు బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయాల వారీగా ఈ పోటీలు నిర్వహించడం వల్ల అన్ని ప్రాంతాల యువతలో క్రీడల పట్ల ఆసక్తి పెంపొందుతుందన్నారు. భవిష్యత్తులో మరింత మంది ఈ పోటీల్లో పాల్గొనేందుకు ఆసక్తి చూపిస్తారన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి గవరసాన సూరిబాబు, ఎంపిపి పెంకె సత్యవతి, సామర్లకోట ఎంపిపి బొబ్బరాడ సత్తిబాబు, వైస్ ఎంపిపి మిర్యాల రాజా, తదితరులు పాల్గొన్నారు.

మహిళల సంక్షేమానికి పెద్దపీట

ప్రజాశక్తి - కాకినాడ

మహిళల సంక్షేమానికి సిఎం జగన్‌మోహన్‌రెడ్డి పెద్ద పీట వేస్తున్నారని ఎంఎల్‌ఎ ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక సూర్యనారాయణపురం, ఆనందభారతి గ్రౌండ్స్‌లో వైఎస్ఆర్ ఆసరా చెక్కుల పంపిణీ జరిగింది. నగరపాలక సంస్థ కమిషనర్ సిహెచ్.నాగనరసింహారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో పురోభివృద్ధి సాధించాలనే ఆకాంక్షతో సిఎం జగన్ అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌సి కర్రి పద్మశ్రీ, వైసిపి నగరాధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, ఎఎంసి ఛైర్‌పర్సన్ వసుపులేటి వెంకటలక్ష్మి నగరపాలక సంస్థ కార్యదర్శి ఎం.యేసుబాబు, మేనేజర్ కర్రి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో అంకితభావం అవసరం

ప్రజాశక్తి - పెద్దాపురం

తమ విధులను అంకితభావంతో నిర్వహించాలని ఆర్‌డిఒ జె.సీతారామారావు ఆదేశించారు. మంగళవారం స్థానిక మెప్మా కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ కెవి.పద్మావతి అధ్యక్షతన జరిగిన బూత్ లెవెల్ అధికారులతో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. బిఎల్‌ఒలు ఎన్నికల ప్రక్రియ విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఓటర్ జాబితాకు అవసరమైన ఓటర్ల నమోదు, చేర్పులు, మార్పులు, ఫోటోలు వంటి అంశాలలో క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతనే నివేదిక ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో రెవెన్యూ ఆఫీసర్ చంద్రశేఖర రావు, బిఎల్‌ఒలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన కమిషనర్

ప్రజాశక్తి - పిఠాపురం



మున్సిపల్ కమిషనర్‌గా ఎన్.కనకారావు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కార్యాలయ ఉద్యోగుల, సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ కనకారావు శాఖల వారిగా సమీక్ష నిర్వహించి రానున్న ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ విధిగా వారి కార్యకలపాలు నిర్వర్తించాలని సూచించారు. అనంతరం ఆయన ఎంఎల్ఎ పెండెం దొరబాబు, ఎంపి వంగా గీత, మున్సిపల్ ఛైర్‌పర్సన్ గండేపల్లి సూర్యవతిని మర్యాదపూర్వకంగా కలిశారు.

ఘనంగా బాలికల దినోత్సవం

ప్రజాశక్తి - తాళ్లరేవు

జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా మండలంలోని పలు పాఠశాలల్లో బాలిక దినోత్సవ కార్యక్రమాలు నిర్వహించారు. మాధవరాయునిపేట ప్రభుత్వ పాఠశాలలో ఐసిడిఎస్ ప్రాజెక్టు సూపర్‌వైజర్లు నలిని, నిభావని ఆధ్వర్యంలో భేటీ బచావో, భేటి పడావో కార్యక్రమం జరిగింది. చిన బొడ్డు వెంకటాయపాలెం జడ్‌పి హైస్కూల్లో 8, 9, 10వ తరగతి విద్యార్థులకు, మాధవరాయునిపేట పాఠశాలలో 'బాలికలను కాపాడదాం-బాలికలను చదివిద్దాం' అనే అంశంపై ర్యాలీ, మ్యూజికల్ చైర్స్ ఆటల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విజేతలకు బహుమతులను అందజేశారు.

ఆటో డ్రైవర్ల నిరసన

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

ఆర్‌టిసిలో మహిళలకు ఉచిత ప్రయాణం పథకాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఆటో డ్రైవర్లు శాంతి ర్యాలీని నిర్వహించారు. స్థానిక స్టేషన్ సెంటర్ నుంచి మటం సెంటర్, మెహర్ కాంప్లెక్స్ మీదుగా తహసీల్దార్ కార్యాలయం వరకూ ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా ధర్నా నిర్వహించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తమ ఉపాధిని దెబ్బకొట్టేలా ప్రభుత్వం చర్యలు తీసుకోరాదని డిమాండ్ చేశారు. తక్షణమే ఆ ప్రతిపాదనలను ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో ఉద్యమం తప్పదని హెచ్చరించారు. అనంతరం డిప్యూటీ తహశీల్దార్‌కు వినతి పత్రాన్ని అందించారు. ఈ కార్య క్రమంలో పలు యూనియన్లకు చెందిన డ్రైవర్లు పాల్గొన్నారు.

అవగాహన సదస్సు జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి - కాకినాడ



గోడపత్రికను ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్, జెవివి, ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ నాయకులు

ఫిబ్రవరి 4న నిరుద్యోగులకు నిర్వహిస్తున్న ఉచిత అవగాహన సదస్సును జయప్రదం చేయాలని యుటిఎఫ్ పూర్వ రాష్ట్ర కార్యదర్శి జి.ప్రభాకర వర్మ పిలుపునిచ్చారు. యుటిఎఫ్ హోంలో మంగళవారం గోడ పత్రికను యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి టి.రవిచక్రవర్తి అధ్యక్షతన ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలోని అంబేద్కర్ భవన్‌లో 4వ తేదీ సాయంత్రం 4 గంటల నుంచి 7 గంటల వరకు అవగాహన సదస్సు జరుగుతుందన్నారు. ఈ సదస్సు పోటీ పరీక్షల కోచింగ్ నిపుణులు, ఎంఎల్‌సిలు కెఎస్ .లక్ష్మణరావు, ఇళ్ల వెంకటేశ్వరరావు సారథ్యంలో యుటిఎఫ్, జెవివి, ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ సంఘాల ఆధ్వర్యంలో జరుగు తాయని తెలిపారు. గ్రూప్స్, డిఎస్‌సి పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగ అభ్యర్థులు పెద్దఎత్తున పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సదస్సు అనంతరం సంబంధిత సబ్జెక్టుల మెటీరియల్‌ను ఉచితంగా అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు జయప్రకాష్, జెవివి జిల్లా ప్రధాన కార్యదర్శి వి.శ్రీరామారావు, ఎస్ఎఫ్ఐ నాయకులు పి.వరహాలు, ఎంజి.సూరిబాబు, ఎ.వాసుదేవ్, జైరాం, యోగి, ఆదర్శ్, డివైఎఫ్ఐ నాయకులు కె.దుర్గాప్రసాద్, పిడి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ పథకాలను అందజేయాలి

ప్రజాశక్తి - కిర్లంపూడి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీరాంజీ

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలను అందించేలా వాలంటీర్లు కృషి చేయాలని వైసిపి యువ నాయకుడు తోట శ్రీరాంజీ సూచించారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో జగపతినగరం, కిర్లంపూడి, చిల్లంగి గ్రామ వాలంటీర్ల సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తుందని, ఆ పథకాలన్నీ ప్రజలకు చేరువ చేసేందుకు మరింతగా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి బొడ్డేటి గణపతి, వైసిపి నాయకులు తోట బాబ్జి, పెనగంటి రాజేష్, దాడి చిన్నబుజ్జి, ఓలేటి రాజు, తోట అయ్యన్న, మహేష్ పాల్గొన్నారు.

వైసిపిలోకి పలువురి చేరిక



పార్టీలో చేరిన వారితో మంత్రి దాడిశెట్టి రాజా

ప్రజాశక్తి - కోటనందూరు

కాకరపల్లి గ్రామానికి చెందిన టిడిపి నాయకులు వాసం చక్రం తన అనుచరులతో కలిసి వైసిపిలో చేరారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ లంక ప్రసాద్ సారథ్యంలో వారు మంత్రి దాడిశెట్టి రాజా సమక్షంలో చేరారు. వీరికి ఆయన వైసిపి కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

దుకాణాల్లో అధికారుల తనిఖీలు

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక చేపలు, కూరగాయల మార్కెట్లలో తూనికలు కొలతల శాఖ అధికారులు మంగళవారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎలక్ట్రానిక్ తూనికల మిషన్లు పనితీరును పరిశీలించారు. అనంతరం తూనికలు కొలతల శాఖ అసిస్టెంట్ కంట్రోలర్ ఎస్‌డి సలీం, పెద్దాపురం ఇన్‌స్పెక్టర్ ఎం.మోహన్ మాట్లాడుతూ ప్రతీ వ్యాపారి నిర్ణీత గడువులోగా తూనికల మిషన్‌లను రెన్యువల్ చేసుకోవాలన్నారు. అధికారుల తనిఖీల సమయంలో తప్పనిసరిగా వ్యాపార సర్టిఫికెట్ ఉండాలన్నారు. ధరల పట్టిక వినియోగదారులకు కనిపించేలా ఉంచాలన్నారు. కుళ్ళిన, నిల్వ సరుకులు విక్రయించరాదని తెలిపారు. ఈ కార్యక్రమంలో వినియోగదారుల సంఘం అధ్యక్షులు భళ్ళమూడి సూర్యనారాయణ మూర్తి, కార్యదర్శి ఎం.భాస్కర్ రావు, తూనికలు కొలతల శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - పెద్దాపురం

బిక్కవోలు పీడర్‌పై మరమ్మతుల కారణంగా ఈ నెల 31వ తేదీ ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామని ఎపిఇపిడిసిఎల్ ఇఇ ఎబిఎన్‌డిఎస్.ప్రభాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. దీనివల్ల 33/11 కెవి ఆనూరు సబ్ స్టేషన్ పరిధిలోని ఆనూరు, కొండపల్లి, వాలుతిమ్మాపురం గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. దీనిని విద్యుత్ వినియోగదారులు గమనించాలన్నారు.

ఇంటి దస్తావేజు పోయినది

ఉండమట్ల సత్యనారాయణ, తండ్రి: చంద్రరావు, డోర్ నెంబర్: 4-4, జెడ్.మేడపాడు, మండపేట మండలం, అంబేద్కర్ కోనసీమ జిల్లా, ఆంధ్రప్రదేశ్. నాకు అంబేద్కర్ కోనసీమ జిల్లా మండపేట మండలంలోని జెడ్.మేడపాడు వంతెన మీద గల కిళ్ళీ కొట్టు బిల్డింగ్‌నకు సంబంధించిన **దస్తావేజు నెంబరు 3219/2016** ఒరిజినల్ లింగ్ డాక్యుమెంట్ ఇల్లు మారుతున్న నేపథ్యంలో కేశవరం నుండి జెడ్.మేడపాడు వెళతుండగా మార్గం మధ్యలో పడిపోయినవి. దొరికినవారు ఈక్రింది అడ్రస్‌కు అందజేయగలరు.

ఉండమట్ల సత్యనారాయణ
S/o. చంద్రరావు, డోర్ నెం. 4-4
జెడ్.మేడపాడు, మండపేట మండలం
డా॥ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా
సెల్: 9063337826

దస్తావేజులు పడిపోయినవి

అయినవిల్లి మండలం, నల్లచెరువు గ్రామ శివారు వర్రేపాలెంనకు చెందిన వర్రే బుల్లిరాజు, తండ్రి: తాతారావుకు చెందిన నేదునూరు గ్రామం 1) రి.సర్వే నెం. 489/7, 2) రి.సర్వే నెం. 489/6, 3) రి.సర్వే నెం. 489/8, 4) రి.సర్వే నెం. 489/7 లలో మొత్తం య. 2.26 సెంట్లునకు సంబంధించిన రిజిస్ట్రరు దస్తావేజు నెం. 4103/1961 మరియు 4104/1961 ఒరిజినల్లు ఇంటి నుండి ముక్కామల వెళ్లుచుండగా మార్గమధ్యలో పడిపోయినవి. దొరికినవారు ఈక్రింది అడ్రసుకు అందజేయగలరు.

వర్రే బుల్లిరాజు, తండ్రి: తాతారావు,
వర్రేపాలెం, అయినవిల్లి మండలం
సెల్: 84660 62628

డాక్యుమెంటు పోయినది

కిర్లంపూడి మండలం, కిర్లంపూడి గ్రామంలో నివసించుచున్న లేటు వేగి వీరబాబు గారి కుమార్తె వేగి స్వాతి సంతోషి అనే నాకు ఏలూరు జిల్లా, ఏలూరు మండలం, కొమడవోలు గ్రామంలో ఆర్.ఎస్. నెం. 13/2, య. 18.81 సెంట్లులో తూర్పు వైపు య. 5.00 సెంట్లు నా తాలూకా లేఅవుట్ చేసిన భూమిలో **డాక్యుమెంటు నెంబరు 1715/2008** ఏలూరు సబ్‌రిజిస్ట్రారు ఆఫీసులో రిజిస్ట్రేషన్ అయిన డాక్యుమెంటు కిర్లంపూడి నుండి రాజుపాలెం వెళ్ళే దారిలో జారి పడిపోయినది. కావున ఎవరికైనా దొరికిన యెడల ఈక్రింది అడ్రస్‌లో తెలియజేయగలరు.

వేగి స్వాతి సంతోషి
యల్లపువారి వీధి, కిర్లంపూడి
తూర్పుగోదావరి జిల్లా
సెల్: 8125929999

మహారాజశ్రీ రాజమహేంద్రవరం ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వారి సముఖమునకు

ఓ.యస్. నెం. 83/2023

యెదిరి:
పురోహిత్ సందీప్ -వాది
మరియు
యర్రా సూర్యకుమారి వగైరాలు -ప్రతివాదులు

To:
D-2: యర్రా శివకుమార్, తండ్రి: లేటు భాస్కరరావు, డోరు నెం. 1-88, హుక్కుంపేట - 533107, రాజమహేంద్రవరం రూరల్. -2వ ప్రతివాది

నోటీసు

పై నెంబరు దావాలో వాది, ప్రతివాదులపై ది. 23-03-2024వ తేదీ గల క్రయ అగ్రిమెంటు అమలు నిమిత్తం పై నెంబరు దావా దాఖలు చేసినారు. సదరు దావా గ్రంధంలో 2వ ప్రతివాది హాజరు నిమిత్తం **ది. 06-02-2024వ తేదీన వాయిదా అయివున్నది.** కావున ఆరోజున 2వ ప్రతివాది హాజరై ఆక్షేపణలు దాఖలు చేసుకొనవలెను. లేనిచో వారి పరోక్షమున దావా తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

P.L.N.PRASAD
P.DHAKSHINA MURTHY
Advocate & Notary
Rajamahendravaram Rajamahendravaram
29-01-2024 Cell: 9849587025

మహారాజశ్రీ ప్రిన్సిపల్ జిల్లా జడ్జి వారి కోర్టు, రాజమహేంద్రవరం

M.V.O.P. No. 361/2019

Between:
Karri Srinivas ...Petitioner
AND
K.Vinod and Others ...Respondents

R-2: Kanamarlapudi Ranga Rao, S/o. Mallesam, Hindu, aged 47 years, Owner of Lorry AP 16 TY 914, R/o. D.No. 6-975/2, Dharmapuri Street, Jaggayyapeta Town and Mandal, Krishna Dist., ...2nd Respondent

పై నంబరు పిటిషన్‌లో 2వ రెస్పాండెంటు అయిన మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు సమన్లు / నోటీసులు పంపినా మీరు వాటిని ఉద్దేశ్యపూర్వకంగా త్రిప్పి వేయుచున్నారు. కావున **ది. 05-2-2024వ తేదీన ఉదయం 10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని, లేదా ప్లీడరు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి సదరు పై పిటిషన్‌లో మీ ఆక్షేపణలను తెలుపుకొనవలెను. లేని యెడల సదరు పిటిషన్‌ను మీకు పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

రాజమండ్రి **డి.సత్యనారాయణమూర్తి**
30-1-24 అడ్వకేటు, రాజమండ్రి

పింఛను పుస్తకం (PPO) పోయినది

గంటి లక్ష్మీకాంతం, W/o. లేటు వెంకటేశ్వరరావు, Ex-TT, BSNL, రాజమహేంద్రవరం. నాయొక్క Family Pension Book నా నివేశ స్థలం లాలాచెరువు నుండి నా ఉద్యోగ ప్రదేశం గోకవరం బస్టాండ్‌కు ఆటోలో వస్తుండగా పోయినది అని, కావున నా యొక్క **PPO No. 501997122109112** గల పుస్తకం ఎవరికైనా దొరికినచో ఈక్రింది చిరునామాకు అందించగలరని కోరుచున్నాను.

గంటి లక్ష్మీకాంతం, Gr. 'D'
BSNL Staff Quarters, Lalacheruvu,
Rajamahendravaram, E.G.Dist., A.P.
సెల్: 9492826553

మహారాజశ్రీ ఆలమూరు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

O.S. 135/2003

Between:
శీలం సతీష్ -వాది
AND
బొంతు శ్రీనివాసరావు, S/o. సత్యనారాయణ, వేమగిరి తోట, కడియం మండలం, రాజమండ్రి JCJC. -ప్రతివాది

పై నెంబరు దావాలో ప్రతివాదికి ఎన్నిసార్లు సమన్లు పంపించినను తప్పించుకుంటున్నందున కోర్టు వారి ఆదేశముపై ఈ ప్రకటన ద్వారా తెలియచేయునది. పై గ్రంథము **దివి. 01-3-2024వ తేదీకి ప్రతివాది హాజరు నిమిత్తము వాయిదా వేయటమైనది. పై తేదీన ఉదయం 10.30 ని॥లకు** కోర్టు వారి ఎదుట హాజరు కావలెను. లేని పక్షమున ప్రతివాది పరోక్షమున పై గ్రంథము తీర్మానము జరుగునని యిందుమూలముగా తెలియచేయడమైనది.

(By Order of the Court)

S.V.V.S.N.MURTHY
ఆలమూరు Advocate & Notary
27-1-2024 Alamuru, Cell: 9490353522

మహారాజశ్రీ ఆలమూరు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

O.S. 87/2003

Between:
Canara Bank, మండపేట -వాది
AND
D-2: కట్టా నాగేంద్ర, S/o. వెంకటేశ్వరరావు, డో.నెం. 36-11-2/1, సైదులుపేట, మండపేట.
D-3: నరాకుల రామారావు, S/o. సత్యనారాయణమూర్తి, డో.నెం. 1-102, మారేడుబాక, ఆలమూరు JCJC. -ప్రతివాద్లు

పై దావాలో ప్రతివాద్లుకు ఎన్నిసార్లు సమన్లు పంపించినను Evade చేయుచున్నందున కోర్టు వారి ఆదేశములు పై యిందుమూలముగా తెలియచేయునది ఏమనగా, పై గ్రంధము పై ప్రతివాదులు హాజరు నిమిత్తము **దివి. 01-3-2024వ తేదీకి వాయిదా వేయటమైనది. ఆ తేదీన ఉదయం 10.30 ని॥లకు** పై కోర్టు వారి ఎదుట హాజరు కావలెను. లేనిచో పరోక్ష తీర్మానము జరుగునని యిందుమూలముగా తెలియచేయటమైనది.

(By Order of the Court)

S.V.V.S.N.MURTHY
ఆలమూరు Advocate & Notary
27-1-2024 Alamuru, Cell: 9490353522

Summons & Notices

IN THE COURT OF THE SENIOR CIVIL JUDGE :: RAMACHANDRAPURAM
I.A.NO. 829/2022 in O.S.No. 66/2022 & O.S.No. 66/2022

BETWEEN:
CHINTA SIVANNARAYANA REDDY ...Petitioner & Plaintiff
AND
GOLUGURI SUBBA REDDY ...Respondent & Defendant

To
GOLUGURI SUBBA REDDY SON OF SATYANARAYANA REDDY., AGE: 34 YRS, RESIDNT OF DOOR NO. 1-121, MAHENDRAWADA VILLAGE, ANAPARTHI MANDAL., ANAPARTHI JCJC LIMITS

Please take notice that the above named Plaintiff has filed the above suit for recovery of amount., and also filed an above IA for attachment of the schedule proeprty and also for other reliefs mentioned therein., against you and the Plaintiff that the said suit, stands posted to **26-02-2024** for your appearance. On that you have to appear in person or through an Advocate **at 10-30 A.M.** before the Court referred above. Otherwise the above case will be decided exparte.

(BY ORDER OF THE COURT)

TANTRAVAHI SUBBA RAO, BSCBL
R.V.G.SUBBA RAO, BSCBL
(Mani Babu)
ADVOCATES FOR PLAINTIFF, RAMACHANDRAPURAM
DT. 25-01-2014 EG DIST

గాంధీకి ఘన నివాళి

ప్రజాశక్తి - యానాం

సమాచార శాఖ ఆధ్వర్యంలో గాంధీ వర్ధంతిని మంగళ వారం ఘనంగా నిర్వహించారు. స్థానిక పెర్రి రోడ్డు, గాంధీ పార్క్, బొటనికల్ గార్డెన్లో ఉన్నటువంటి గాంధీ విగ్రహాలకు పరిపాలనాధికారి మునిస్వామి పూల మాలలేసి నివాళులర్పించారు. ప్రభుత్వ ఆసుపత్రి డిప్యూటీ డైరెక్టర్ రవిశంకర్, వ్యవసాయ శాఖ డిప్యూటీ డైరెక్టర్, తహశీల్దార్, పిఆర్‌ఓ ప్రసాద్, మున్సిపల్ ఇన్‌ఛార్జ్ కమిషనర్ రామకృష్ణ, సిఐ షణ్ముగం, ఎస్‌ఐ నూకరాజు, వ్యవసాయ, ప్రభుత్వ ఆసుపత్రి, మున్సిపాలిటీల సిబ్బంది పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, **KOVIRI YESU DASS,** S/o. Koviri Bangarayya, D.No.48-4-40, Suradavari Street, Municipal School, Golilapeta, Kakinada (Urban), Kakinada District, Andhra Pradesh - 533002, have been changing my name from **KOVRI YESU** (Old Name) to **KOVIRI YESU DASS** (New Name). Henceforth I am being called as **KOVIRI YESU DASS** (New Name). This is for all records.

మహారాజశ్రీ కాకినాడ 5వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

O.S.No.1199/2023

Between:
గొరుసు వెంకటలక్ష్మి ...వాది
and
మహమ్మద్ అహ్మద్ ఆలీషా వగైరాలు ...ప్రతివాదులు

To: ప్రతివాదులు:
1) **మహమ్మద్ అహ్మద్ ఆలీషా,** S/o. మహ్మద్ హుస్సేన్ షా (లేటు), వయస్సు 57 సం॥లు, డో.నెం. 15-5-8, గాబువారి వీధి, రామకృష్ణారావుపేట, కాకినాడ
2) **మహమ్మద్ బషీరున్నీసా,** W/o. మహమ్మద్ అహ్మద్ ఆలీషా, వయస్సు 48 సం॥లు, డో.నెం. 15-5-8, గాబువారి వీధి, రామకృష్ణారావుపేట, కాకినాడ
3) **మహమ్మద్ హుస్సేన్,** D/o. మహమ్మద్ అహ్మద్ ఆలీషా, వయస్సు 30 సం॥లు, డో.నెం. 15-5-8, గాబువారి వీధి, రామకృష్ణారావుపేట, కాకినాడ

పై నెంబరు దావాలో వాది తనకు రావలసిన ప్రామిసరీ నోటు బాకీ నిమిత్తం 1 to 3 ప్రతివాదులు అయిన మీపై దావా దాఖలు చేసియున్నారు. సదరు దావాలో శ్రీ కోర్టువారు ద్వారా ఎన్నిసార్లు సమన్లు పంపినను మీరు తీసుకొనక ఉద్దేశ్య పూర్వకంగా కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టువారు మీ హాజరు నిమిత్తం ది.**12-02-2024** తేదీకి వాయిదా వేసియున్నారు. కావున మీరు ఆరోజు ఉదయం **10.30** ని॥లకు మీరు పై కోర్టువారి ఎదుట స్వయంగా గాని, మీ వకీలు ద్వారా గాని హాజరయ్యి మీ ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేని యెడల పై దావా మీ పరోక్షమున తీర్మానించబడును.

(కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)

గొరుసు రాజకీర్తి, అడ్వకేట్
డో.నెం.15-2-15, గొరుసువారి వీధి
రామకృష్ణారావు పేట, కాకినాడ, సెల్: 9703869199

ప్రకటన

మహారాజశ్రీ డా॥ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా అథారిటీ అండర్ వర్క్‌మెన్ కాంపెన్‌శేషన్ ఏక్ట్ అండ్ అసిస్టెంట్ కమీషనర్ ఆఫ్ లేబర్ అమలాపురం.

E.C.M.P.No.2/2023

Between:
జంగా బాలాజీ మరియు ఇద్దరు ..... అప్లికెంట్లు
మరియు
వీరగన్ని సుజాత, W/o. రాధాకృష్ణ. డోర్ నెం.17-1-3/1, టి.టి.డి.కళ్యాణ మండపం, ఆలమూరు రోడ్, మండపేట, డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, ఆంధ్రప్రదేశ్ మరియు ఇంకొకరు ...ఆపోజిట్ పార్టీలు

పై నెంబరు పిటిషన్‌లో 1వ ఆపోజిట్ పార్టీ అయిన వీరగన్ని సుజాత **W/o.** రాధాకృష్ణ గార్కి శ్రీ కోర్ట్ వారు ద్వారా ఎన్నిసార్లు సమన్లు పంపినను తీసుకొనక కాలయాపన చేయుచున్నందున సదరు 1వ ఆపోజిట్ పార్టీ అయిన వీరగన్ని సుజాత గార్కి నోటీసు అమలు నిమిత్తం ఈ పేపర్ నోటీసు ప్రకటన ద్వారా వారి హాజరు నిమిత్తం ది.వి.**08-02-2024**న ఉదయం 10.30 నిమిషములకు పై కోర్ట్ వారి ఎదుట స్వయముగా గాని వారి న్యాయవాది ద్వారా గాని హాజరై మీ యొక్క ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల పై పిటిషన్ నందు మీ పరోక్షముగా తీర్మానించబడును.

వాయిదా తేది: 08-02-2024

అమలాపురం **దాకారపు ఎరకయ్య,** అడ్వకేట్
తేది:27-1-2024 అమలాపురం

మహారాజశ్రీ కాకినాడ 5వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

I.A. No.593/2023 in O.S.No.1199/2023

Between:
గొరుసు వెంకటలక్ష్మి ...పిటిషనర్/వాది
and
మహమ్మద్ అహ్మద్ ఆలీషా వగైరాలు ...రెస్పాండెంట్స్/ప్రతివాదులు

To: రెస్పాండెంట్స్:
1) **మహమ్మద్ అహ్మద్ ఆలీషా,** S/o. మహ్మద్ హుస్సేన్ షా (లేటు), వయస్సు 57 సం॥లు, డో.నెం. 15-5-8, గాబువారి వీధి, రామకృష్ణారావుపేట, కాకినాడ
2) **మహమ్మద్ బషీరున్నీసా,** W/o. మహమ్మద్ అహ్మద్ ఆలీషా, వయస్సు 48 సం॥లు, డో.నెం. 15-5-8, గాబువారి వీధి, రామకృష్ణారావుపేట, కాకినాడ
3) **మహమ్మద్ హుస్సేన్,** D/o. మహమ్మద్ అహ్మద్ ఆలీషా, వయస్సు 30 సం॥లు, డో.నెం. 15-5-8, గాబువారి వీధి, రామకృష్ణారావుపేట, కాకినాడ

పై నెంబరు దావాలో వాది తనకు రావలసిన ప్రామిసరీ నోటు బాకీ నిమిత్తం 1 to 3 ప్రతివాదులు అయిన మీపై దావా దాఖలు చేసియున్నారు. సదరు దావాలో మీ తాలూకు ఆస్తిని తోడజప్తు చేయమని కోరుతూ I.A. No.593/2023గా పిటిషన్ కూడా దాఖలు చేసియున్నారు. సదరు పిటిషన్లలో శ్రీ కోర్టువారి ద్వారా మీకు ఎన్నిసార్లు నోటీసులు పంపినను మీరు తీసుకొనక ఉద్దేశ్య పూర్వకంగా కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టువారు మీ హాజరు నిమిత్తం ది.**12-02-2024** తేదీకి వాయిదా వేసియున్నారు. కావున మీరు ఆరోజు ఉదయం **10.30** ని॥లకు మీరు పై కోర్టువారి ఎదుట స్వయంగా గాని, మీ వకీలు ద్వారా గాని హాజరయ్యి మీ ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేని యెడల పై పిటిషన్ మీ పరోక్షమున తీర్మానించబడును.

(కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)

గొరుసు రాజకీర్తి, అడ్వకేట్
డో.నెం.15-2-15, గొరుసువారి వీధి
రామకృష్ణారావు పేట, కాకినాడ, సెల్: 9703869199